# ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందాలి

- గ్రామాలన్నింటికీ బస్సు సౌకర్యం కల్పించాలి
- అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం ప్రారంభం


పెంచిన ఆరోగ్యశ్రీ ప్లకార్డుతో ఎమ్మెల్యే అధికారులు

జగిత్యాల, డిసెంబర్ 10: కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందించాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం, ఆరోగ్య శ్రీ పథకంలో రూ.10 లక్షల దాకా ఉచిత ఆరోగ్య చికిత్స కార్యక్రమం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆర్టీసీ బస్సులో మహిళల ఉచిత ప్రయాణ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందచేయడంలో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమన్నారు. ఆరోగ్యశ్రీలో చికిత్సలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.5 లక్షలకు పెంచితే, నేటి కొత్త ప్రభుత్వం రూ.10 లక్షలకు పెంచడం ఆనందదాయకమన్నారు. మరికొన్ని రోగాలను ఇంకా ఆరోగ్యశ్రీలో చేర్చాలని, పేదలకు మరింత ఉపయోగంగా ఉంటుందన్నారు. అయితే మహాలక్ష్మి పథకం వల్ల మహిళలందరికీ మేలు జరుగడం లేదని, బస్సు సౌకర్యం లేని గ్రామాలకు వెంటనే బస్సులు నడిపించాలని కోరారు. గత బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో మహిళల కోసం న్యూట్రిషన్ కిట్లు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు జీతాల పెంపు, బాలికల గురుకుల ఏర్పాటు, జగిత్యాలలో ఎస్సీ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల ఏర్పాటు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, బీడీ పెన్షన్, ఒంటరి మహిళ పెన్షన్, పాత ప్రభుత్వంలో విద్య వైద్యానికి పెద్ద పీట వేసినట్లు గుర్తు చేశారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఆటో యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని, వారికి రూ.15 వేల జీవన భృతి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని ఆకాంక్షించారు. ఇక్కడ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ జైపాల్ రెడ్డి, డిపో మేనేజర్ జీ సునీత, స్థానిక కౌన్సిలర్లు దాసరి లావణ్య ప్రవీణ్, జ్యోతి లక్ష్మణ్, జిల్లా అధికారులు సాయి బాబా, నరేష్, కమిషనర్ అనిల్, కౌన్సిలర్లు ఉన్నారు.


వేములవాడ ఏరియా దవాఖానలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్ రావు, ఆర్డీవో మధుసూదన్

# నిరుపేదలకు వరం రాజీవ్ ఆరోగ్యశ్రీ

వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ● ఏరియా దవాఖానలో ప్రారంభం

వేములవాడ, డిసెంబర్ 10: నిరుపేదలకు రాజీవ్ ఆరోగ్య శ్రీ వరం లాంటిదని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం వేములవాడ ఏరియా దవాఖానలో రాజీవ్ ఆరోగ్యశ్రీ 10 లక్షల వరకు ప్రభుత్వం పెంచిన సందర్భంగా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. గతంలో ఐదు లక్షల వరకే ఉన్న ఆరోగ్య బీమా ప్రస్తుతం రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా మొత్తం పది లక్షల వరకు పెంచామని తెలిపారు. ఈ పథకం ద్వారా 1672 రకాల వ్యాధులకు వైద్యం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాన్ని సద్వినియోగం చేసుకొనే కాకుండా మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. వైద్య వృత్తి పవిత్రమైందని వైద్యులు నిరంతరం సేవలు అందించాలని సూచించారు. బుడగ జంగాలకాలనీని సందర్శించిన శ్రీనివాస్‌కు స్థానికులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రతిసారి కాలనీ వరద ముంపునకు గురవుతున్నందున రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఆవుల సుమన్ మోహన్ రావు, ఆర్డీవో మధుసూదన్, ఏరియా దవాఖాన ఆర్‌ఎంవోలు సంతోష్‌చారి, అనిల్‌కుమార్, కౌన్సిలర్ జోగిని శంకర్, జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సాగరం వెంకటస్వామి, పుల్కం రాజు, సంఘ స్వామి, విజయ్, శ్రీనివాస్, మల్లేశం, పాత సత్యలక్ష్మి, సూగూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


పెద్దపల్లి బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే విజయ రమణారావు

# మహిళా సాధికారతే సర్కారు లక్ష్యం

● పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 10: మహిళా సాధికారతే రేవంత్‌రెడ్డి సర్కారు లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం పెద్దపల్లి బస్టాండ్‌లో మహిళల ఫ్రీ బస్ సర్వీసును జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మహిళలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం మహాలక్ష్మి స్కీంకు శ్రీకారంచుట్టిందన్నారు. ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆడబిడ్డలు, ట్రాన్స్‌జెండర్స్ ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఫ్రీగా ప్రయాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్డీఓ మధుమోహన్, నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యురాలు యాట దివ్యరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు ఈర్ల స్వరూప, కౌన్సిలర్లు నూగిల్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, నాయకులు బోడ్డుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లికి గోదావరి పరిక్రమ యాత్ర


సాధువుల ఆశీర్వచనం తీసుకుంటున్న భక్తులు

మారుతీనగర్, డిసెంబర్, 10: లోక కల్యాణార్థం 1008 సాధువుల ఆశ్రమాల పీఠాధిపతి, భారతదేశ అంఖండ సాధుసంతతి అధ్యక్షుడు మహామండలేశ్వర శ్రీమాదయాచారి ఆధ్వర్యంలో చేపట్టిన గోదావరి పరిక్రమ యాత్ర ఆదివారం మెట్‌పల్లికి చేరింది. పట్టణ శివారులోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో సుమారు 300ల మంది సాధువులు విడిది చేశారు. కాగా మహాకుంభమేళాలోనే కనిపించే ఇంత మంది సాధువులు మెట్‌పల్లికి రావడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. పలువురు వారి ఆశీర్వచనం తీసుకున్నారు. స్వయంగా చేసుకున్న భోజనాన్ని వచ్చి భక్తులకు ప్రసాదాన్ని అందించి సహపంక్తి భోజనం చేశారు. గోదావరి పుట్టిన ప్రదేశం నుంచి సముద్రంలో కలిసే చోటు వరకు గోదావరి ప్రవహించే ఆలయాల వద్ద పుణ్యస్నానాలు, హోమాలు చేస్తూ ముందుకెళ్తున్నారు. వెల్లుల్ల దత్తాత్రేయ ఆశ్రమానికి సోమవారం ఉదయం చేరుకొని అక్కడ నుంచి కందకుర్తికి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెల్లుల్ల హారతి మాతాజీ, శ్రీపతి నాగభూషణం, గురిజెల రాజరెడ్డి, సత్యనారాయణ, కొత్త సురేశ్, వనపర్తి చంద్ర, బట్టు హరికృష్ణ, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

# రాజన్న క్షేత్రం.. 'కార్తీక' శోభితం


కార్తీకదీపాలు వెలిగిస్తున్న మహిళలు

- చివరిరోజూ భారీగా తరలివచ్చిన భక్తులు
- ధర్మగుండంలో పవిత్ర స్నానాలు
- క్యూలైన్లలో వెళ్లి స్వామివారి దర్శనం
- కార్తీకదీపాలతో కళకళలాడిన ఆలయం


ఆలయ ఆవరణలో భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబర్ 10: కార్తీక మాసం చివరిరోజైనా ఆదివారం వేములవాడ రాజన్న ఆలయం భక్తజన సంద్రమైంది. క్షేత్రంలో ఎటూ చూసినా భక్తుల సందడి కనిపించింది. రాష్ట్ర నలుమూలల నుంచి శనివారం రాత్రే పెద్దసంఖ్యలో తరలిరావడం కనిపించింది. వేకువజామున ధర్మగుండంలో స్నానాలు చేశారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. క్యూలైన్ల గుండా వెళ్లి రాజన్నను దర్శించుకున్నారు. తనివితీరా తిలకించి ఇంటిల్లిపాది బాగుండాలని మొక్కుకున్నారు. రాజన్నకు ప్రీతిపాత్రమైన కోడె మొక్కును చెల్లించుకున్నారు. గండదీపంలో నూనెపోసి వెలిగించారు. పలువురు తామెత్తు బెల్లాన్ని సమర్పించి ఆలయ ఆవరణలో పంచిపెట్టారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు గర్భగుడిలో ఆర్జితసేవలు రద్దు చేశారు. దీంతో అనుబంధ దేవాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో అభిషేకపూజలు నిర్వహించుకున్నారు. ఆలయ పరిసరాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, పర్యవేక్షకులు తిరుపతిరావు, అల్లి శంకర్, ఇన్స్‌పెక్టర్లు అశోక్, పవన్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాదాపు రాజన్నను 40 వేలకు పైగా భక్తులు దర్శించుకున్నారని ఆలయ అధికారులు వెల్లడించారు.

# రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పేదలకు వరం

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్


ఉచిత బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 10: రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాలు పేదలకు వరంలాంటివని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ దవాఖాన ఆవరణలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, మహిళా ఉచిత బస్సు ప్రయాణం(మహాలక్ష్మి) పథకాన్ని అదనపు కలెక్టర్ అరుణశ్రీ, సిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందుతో కలిసి ప్రారంభించి, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసేవలో ఎల్లవేళలా ముందుంటుందన్నారు. ఎంప్యానల్ దవాఖానలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామని, రాష్ట్ర సరిహద్దు దకా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్రయాణించవచ్చని తెలిపారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాగా, ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన తొలిసారి గోదావరిఖనికి వచ్చిన సందర్భంగా ప్రధాన చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఇక్కడ మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్, ఆర్టీసీ డీఎం నాగభూషణం, డీఎంహెచ్‌ఓ ప్రమోద్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృపాబాయి, సూపరింటెండెంట్ దయాళ్‌సింగ్, ఆర్‌ఎంఓ అర్చన, అప్పారావు, నాయకులు ముస్తాఫా, ఫక్రుద్దీన్, బొంతల రాజేశ్, కొప్పుల శంకర్, పెద్దెల్లి ప్రకాశ్, దీటు బాలరాజ్, పాతిపెల్లి ఎల్లయ్య ఉన్నారు.